ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
3
బుధవారం 18 సెప్టెంబరు 2024



సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పారదర్శక పాలన

- పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు
- ప్రజల ఆకాంక్షతోనే తెలంగాణ ఏర్పాటు
- జిల్లాలోని రైతులకు రూ. 839 కోట్ల రుణమాఫీ
- 1,89,806 కుటుంబాలకు గృహజ్యోతి
- పైసా ఖర్చు లేకుండానే మహిళలకు ఆర్టీసీ ప్రయాణం
- నిరంతరంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 17 : రాష్ట్రంలోని అన్నివర్గాలకూ స్వేచ్ఛ, సామాజికన్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నామని బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చి, రాష్ట్ర స్వప్నాన్ని ఆమోదించింది, ఇచ్చింది కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు.

ప్రజాపాలన దరఖాస్తులు 3.25లక్షల పైనే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లాలో గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు 8 రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 499 గ్రామ పంచాయతీలలో ఎంపీడీవోలు 23 బృందాలుగా, తహసీల్దారులు 25 బృందాలుగా, 5 మున్సిపాలిటీలో 15 బృందాలుగా ఏర్పడి ప్రజల నుంచి జిల్లావ్యాప్తంగా 3,25,214 దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. జిల్లాలోని ప్రతీ మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు.

ఆర్టీసీలో 2.72 కోట్ల మంది మహిళలు ప్రయాణం

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 2.72 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు. ఫలితంగా మహిళలకు రూ.100.39 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, పథకం కింద పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో వైద్యపరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 17,261 మంది పేదలు చికిత్స పొందారని, అందుకు గాను ప్రభుత్వం రూ. 38.44 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు.

ప్రతీ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు

నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నిజం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఆ లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఈ పథకం కింద ఏడాదిలో 4.50 లక్షల గృహాలు నిర్మించ తలపెట్టామని, ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామన్నారు. పెరుగుతున్న ధరల ప్రభావం పేదలపై పడరాదన్న సంకల్పంతో మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ అందిస్తున్నామని, జిల్లాలో 1,67,872 మందికి లబ్ధి చేకూరుతుందని వివరించారు.

మూడు విడతల్లో రుణమాఫీ

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో రైతుల రుణమాఫీకి అర్హులైన 1,02,075 మందికి గానూ రూ.839 కోట్లలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మహిళలందరినీ ఐదేళ్లలో కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ, వారి జీవనోపాధి పెంపొందించే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో 2024-25 గాను 18,788 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.165 కోట్లతో జీవనోపాధి కల్పించడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

గృహజ్యోతితో పేదలకు లబ్ధి

గృహజ్యోతి కార్యక్రమం కింద 200 యూనిట్ల లోపు వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 1,89,806 కుటుంబాలకు ఈ పథకంతో లబ్ధి చేకూరుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాల నిర్మూలన చేస్తూ పోలీసులు, ప్రజలతో మమేకమయ్యేలా ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, శాంతి భద్రతల నిర్వహణకు అహర్నిశలు చేస్తున్న పోలీసు యంత్రాంగానికి, వైద్యులకు, పారిశుధ్య కార్మికులకు, అన్నిశాఖల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ స్ఫూర్తితో నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా అవిశ్రాంతంగా పాటుపడే తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ఆకాంక్షించారు.



హాజరైన కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజలు



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

కలెక్టరేట్‌లో...

సిద్దిపేట కలెక్టరేట్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బైరాన్‌పల్లి అమరులను మరిచిన ప్రజాప్రతినిధులు



బైరాన్‌పల్లిలోని అమరవీరుల స్తూపం

ధూళిమిట్ట, సెప్టెంబరు 17 : నిజాం సైన్యమైన రజాకార్లు గ్రామాలపై పడి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ విర్రవీగుతున్న రోజుల్లో ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామం ఎదురొడ్డి నిలిచింది. రజాకార్ల ఆగడాలను మూడుసార్లు సమర్థవంతంగా తిప్పికొట్టిన బైరాన్‌పల్లి వాసులు నాలుగోసారి రజాకార్ల దాడిలో ఆగస్టు 27న దాదాపు 118 మంది గ్రామస్థులు అమరులయ్యారు. ఇంతటి చరిత్ర కలిగిన ఈ గ్రామాన్ని ప్రతీ సంవత్సరం ఆగస్టు 27 లేదా సెప్టెంబరు 17న అమరవీరుల స్తూపం, బురుజు వద్ద ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు నివాళులర్పించేవారు.. కానీ ఈ ఏడాది ప్రజాప్రతినిధులు మర్చిపోయారు. గతంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి అమరులకు నివాళులర్పించారు. బైరాన్‌పల్లి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ఆ హామీలు నీటిమూటలుగానే మిగిలాయని, ఈ ఏడాది కనీసం నివాళులర్పించడానికి కూడా రాలేదని, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా నివాళులర్పించకపోవడం శోచనీయమని ఈ ప్రాంతవాసులు చర్చించుకుంటున్నారు.

నివాళులర్పించిన రంగు బాలలక్ష్మి

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి మంగళవారం బైరాన్‌పల్లిలో అమరుల స్తూపానికి నివాళులర్పించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆనాటి పోరాట సమరయోధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బైరాన్‌పల్లి పోరాట ఘట్టాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చే విధంగా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో రామ్మోహన్, ఎస్ఐ మహబూబ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ మరింత మెరుగవ్వాలి

- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 17: రోగుల భద్రతతో పాటు రోగ నిర్ధారణను మరింత మెరుగుపర్చాలని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్ తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో ప్రపంచ రోగి భద్రతా దినోత్సవంపై జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది సెప్టెంబరు 17న ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. వారం పాటు వివిధ ప్రజా చైతన్య కార్యక్రమాలు, వైద్యులకు సెమినార్లు వంటి విద్యాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రోగులు వారికున్న సమస్యలను నిర్భయంగా వైద్యులకు చెబితేనే మెరుగైన వైద్యాన్ని అందించగలరని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేష్‌బాబు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాగిణి, ఆర్ఎంవో డాక్టర్ సదానందం, వైద్యులు గీత, సుమలత, దేశం, రమ్య, ప్రశాంతి, సరళ, ప్రదీప్ పాల్గొన్నారు.



సిద్దిపేటలో ప్రపంచ రోగి భద్రత దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది

ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి



- కిలో వెల్లుల్లి రూ.300పైనే
- ఉల్లి కిలో రూ.60
- వంటనూనెలదీ అదే దారి
- నెల రోజుల్లో రెండింతలు పెరిగిన ధరలు
- కొనలేనిస్థితిలో సామాన్యులు

5 లో..



సిద్దిపేటలోని కోటిలింగాల ఆలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్‌లోని సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు తగదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తలి విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

వినాయకా.. సెలవిక..

- గంగమ్మ ఒడికి చేరిన గణపయ్య
- ఆటపాటలతో విఘ్నేశ్వరుడికి వీడ్కోలు
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 17 : జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తొమ్మిది రోజుల పాటు పల్లె, పట్నం పార్వతీ పుత్రుని నామస్మరణతో మారుమోగాయి. నవరాత్రులు వినాయక మండపాల వద్ద విశేష పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం సుమారు 2 వేల గణపతులను గంగమ్మ ఒడికి చేర్చారు. సిద్దిపేట ఎర్రచెరువు, కోమటి చెరువు బైపాస్ రోడ్డు వైపు నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్‌లైట్లు, క్రేన్లు, సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. నిమజ్జన ప్రాంతాలను సీసీ కెమెరాల నిఘాలో పోలీసు కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చూశారు. మహిళలు కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిమజ్జన వేడుకల్లో ఆకట్టుకున్నాయి. ధగధగ మెరుపుల విద్యుత్ కాంతుల వెలుగుల్లో చిన్నా, పెద్దా తీన్మార్ స్టెప్పులతో సందడి చేశారు. శోభాయాత్ర అనంతరం గణపతిబప్పా మోరియా, జై బోలో గణేష్ మహరాజ్ అంటూ గణపయ్యలను గంగమ్మ ఒడికి చేర్చారు. వచ్చే యేడు మళ్లీ రావయ్యా గణపయ్య అంటూ వేడుకున్నారు.























'కాకతీయుల శిలాశాసనాన్ని పరిరక్షించండి'

సంగారెడ్డి రూరల్: కొండాపూర్ మండం మారేపల్లిలోని కాకతీయుల కాలం నాటి శిలాశాసనాన్ని పరిరక్షించాలని గ్రామానికి చెందిన హన్మకొండ జంగయ్య మంగళవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు.

'దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ కృషి'

జహీరాబాద్, సెప్టెంబరు 17: బీజేపీ ప్రభుత్వం దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమే పరమావధిగా ప్రధాని మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సేవాపక్వాడ పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు జైపాల్‌రెడ్డి, నౌబాద్‌జగన్, గొల్లభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందే బీఆర్ఎస్

● కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 17: తెలంగాణను అప్పులపాలు చేసిందే బీఆర్ఎస్ అని, మాట్లాడే నైతిక హక్కు హరీశ్‌రావుకు లేదని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిగులు రాష్ట్రంగా సోనియాగాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. ధనిక తెలంగాణ అంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. హరీశ్‌రావు మెదక్ జిల్లాను దివాళా తీయించారని, ఏం ఉందని మెదక్ వచ్చి మాట్లాడుతున్నావంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలను ప్రజల ముందు పెడుతుంటే హరీశ్‌రావు ఎందుకు ఉక్కిలి పడుతున్నాడంటూ ఎద్దేశా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన నడుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిదినెలల కాలంలో అనేక హామీలను అమలు చేసిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజొద్దీన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, బొజ్జ పవన్, అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, శంకర్, యూత్ కాంగ్రెస్ నేత భరత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో వాగ్వాదం

●ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం


గాయాలతో ఆటోడ్రైవర్ విఠల్

హత్నూర, సెప్టెంబరు 17: వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో వాగ్వాదం జరగడంతో ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగింది. మల్కాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ పటేల్ విఠల్‌గౌడ్ దౌల్తాబాద్ నుంచి ప్రయాణికులతో సంగారెడ్డి వైపు బయలుదేరాడు. మల్కాపూర్ గ్రామ శివారులోని ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలోకి చేరుకోగానే, వెనకనుంచి వచ్చిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ పదేపదే హారన్ కొడుతుండడంతో అసహనానికి గురైన విఠల్‌గౌడ్ రోడ్డుపై ఆటో నిలిపి.. ముందు వాహనాలు ఉండగా సైడ్ ఎలా ఇచ్చేదని ప్రశ్నించారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ కూడా బస్సును రోడ్డుపై ఆపి కిందకు దిగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోవడంతో, వాహనదారులు పోలీసులకు సమాచారమందించారు. వారు వచ్చి ఆర్టీసీ బస్సు ఆటోతో పాటు ఇద్దరు డ్రైవర్లను హత్నూర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడికి వెళ్లగానే పోలీసులు ఆటోడ్రైవర్ ఫోన్ తీసుకున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అనిల్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తుండగా, విఠల్‌గౌడ్ తనవెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు అతడిపై నీళ్లు చల్లి మంటలాను ఆర్పి.. చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు బాధితుడి కుటుంబీకులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి జైలుకు పంపితే 20 ఏళ్ల వరకు బయటకు రావని పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడంతో చనిపోవాలనుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నామని, ఎవరినీ బెదిరించలేదని ఎస్ఐ సుభాష్ స్పష్టం చేశారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్



చిట్కుల్‌లో ప్రజాపాలన దినోత్సవంలో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 17: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఆనాడు రాచరిక సంకెళ్లను తెంచుకోవడం కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో అమరులయ్యారన్నారు. ఆనాటి త్యాగాలు, పోరాటల స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ జనరంజక పాలన సాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో బాల శౌరి, ఈవో కవిత, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్, నారాయణ, మురళి, శ్రీను, గోపాల్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల, పాఠశాల సిబ్బంది

నర్సాపూర్, సెప్టెంబరు 17: జూనియర్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బలరాం, పాఠశాల ప్రిన్సిపాల్ రవి, పీడీ లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబరు 1 నుంచి 6వ తేదీ వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ధరాఘాతం



● కిలో వెల్లుల్లి రూ.300పైనే
● ఉల్లి ధర కిలో రూ.60
● వంటనూనెలదీ అదేదారి..
● కొనలేనిస్థితిలో సామాన్యులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 17: వంటింట్లో నిత్యావసర ధరల మంటలు భగ్గుమంటున్నాయి. ప్రజలు ఉపయోగించే నిత్యావసరాల ధరలు నెల రోజుల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం రెండింతలు పెరిగాయి. గత నెలలో ఉల్లిగడ్డ కిలో రూ.20 నుంచి రూ.30 వరకు ఉండగా ప్రస్తుతం రూ.50 నుంచి రూ.70 వరకు పెరిగింది. అదేవిధంగా వెల్లుల్లి ధర గత నెలలో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు ఉండగా ప్రస్తుతం రూ.300 పైననే ధర పలుకుతుంది . నెల రోజులలోనే నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

పంటలు దెబ్బతినడమే కారణం..

ఉల్లి, వెల్లుల్లి ధరలు నెల రోజుల వ్యవధిలోనే రెండింతలు పెరగాడానికి కారణం కర్నాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాల్లో వర్షాలకు ఆయా పంటలు దెబ్బతినడమే కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ఆగస్టు నుంచి గత వారం క్రితం వరకు కూడా పెద్ద ఎత్తున వర్షాలు కురిసి వరదల కారణంగా ఉల్లి గడ్డ,వెల్లుల్లి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మన రాష్ట్రాలకు సరఫరా కావాల్సిన ఉల్లి గడ్డ, వెల్లుల్లి తగ్గిపోవడంతో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

వంట నూనె ధరలకూ రెక్కలు..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సన్‌ఫ్లవర్, పామాయిల్‌పై జీఎస్టీని పెంచడంతో మూడు రాజులుగా వాటి ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్ నూనె మూడు రోజుల కిందట కిలో ప్యాకెట్ ధర రూ.110 ఉండగా ప్రస్తుతం రూ.130కి చేరుకుంది. పామాయిల్ ధర రూ.95 ఉండగా ప్రస్తుతం రూ.120కి చేరింది. వీటితోపాటు క్వింటాల్ సన్న బియ్యం ధర ఎకంగా రూ.6 వేల పైననే పలుకుతున్నది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మరింత పెరిగే అవకాశం ఉంది..



నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి, వెల్లుల్లి ధరలు రెండింతలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని పెంచిన కారణంగా మూడు రోజుల నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. వర్షాలు కురిసి పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. రానున్న రోజులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

-పంచామి స్వామి,
సూపర్ మార్కెట్ వ్యాపారి, దౌల్తాబాద్ మండలం

సామాన్యులు కొనలేని పరిస్థితి..

ఇప్పుడున్న ధరలు చూస్తే ఏమీ కొనలేని సపరిస్థితి నెలకొంది. ఉల్లిగడ్డ, వెలుల్లిగడ్డ ధరలు మండిపోతున్నాయి. ఇంత ధరలు ఎన్నడూ చూడలేదు. నూనె ధరలు కూడా పెరగడంతో పేదలందరూ అవస్థలు పడుతున్నారు. ధరలు నియంత్రిచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే సామాన్య ప్రజలకు పచ్చడి మెతుకులతోనే కాలం వెల్లదీయాల్సి ఉంటుంది.

-గడ్డమీది శేఖర్‌గౌడ్
దొమ్మాట,హోటల్ యజమాని ,దౌల్తాబాద్ మండలం

తెలంగాణ విమోచనంపై కాంగ్రెస్ ద్వంద్వ నీతి

● బీజేపీ అధికారంలోకి రాగానే తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తాం
● మెదక్ ఎంపీ రఘునందన్ రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినోత్సవంపై కాంగ్రెస్ ద్వంద్వం నీతి ప్రదర్శిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేటలోని ఎస్ఎస్‌వీ బ్లడ్ బ్యాంకులో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ విమోచన దినోత్సవాన్ని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వం జాతీయ జెండా ఎగురవేసి విమోచన దినోత్సవం జరిపిందన్నారు. కాంగ్రెస్‌కు విమోచన దినోత్సవంపై ఒకే స్టాండ్ ఉంటే రెండు రాష్ట్రాల్లో అలా ఎందుకు జరుపుతుందని నిలదీశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్, అంబటి బాలేష్‌గౌడ్, నాయకులు చింత సంతోష్, ఉపేందర్‌రావు, విభీషణ్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కానుగంటి శ్రీనివాస్, కొత్తపల్లి వేణుగోపాల్, బాసంగారి వెంకట్, గోనె మార్కండేయులు, తొడుపునూరి వెంకటేశం, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ.. రూ.లక్షల్లో..

● పోటాపోటీగా వేలం
● మారుమూల గ్రామాల్లోనూ లక్షలు పలికిన ధర
● అశోక్‌నగర్‌లో రూ.7.8 లక్షలకు సత్యనారాయణ కైవసం



అశోక్‌నగర్ గణేశ్ లడ్డూను దక్కించుకున్న సత్యనారాయణ

రామచంద్రాపురం/సెప్టెంబరు 17: :సెప్టెంబరు 17 : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణనాథుడి లడ్డూ వేలంలో రూ.లక్షల్లో ధర పలికింది. పలు ప్రాంతాల్లో లడ్డూను దక్కించుకునేందుకు భకక్తులు పోటీపడ్డారు. రామచంద్రాపురం మండలంలోని అశోక్‌నగర్‌లోని ఆలయం వద్ద జరిగిన వేలంలో లడ్డూను భవానిపురానికి చెందిన సత్యనారాయణ రూ.7.80లక్షలకు దక్కించుకున్నారు. ఈదులనాగులపల్లిలోని లిటిల్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను కాల్వగడ్డ రాజ్‌కుమార్ రూ.3.67 లక్షలకు దక్కించుకున్నారు. పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద జనరల్ లడ్డూని రూ.2.21 లక్షలకు పి.వెంకట్‌రెడ్డి, మహిళా లడ్డూను తాళ్ల పద్మకుమార్‌గౌడ్ దక్కించుకున్నారు.

నారాయణఖేడ్ మండలంలో

మండలంలోని పంచగామ కాశీనాథ్ బాబా ఆశ్రమం ఆవరణలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూను కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పరిధిలోని మాచరెడ్డికి చెందిన రంగ సంగమేశ్వర్‌గౌడ్ కుటుంబ సభ్యులు రూ.4.26 లక్షలకు సొంతం చేసుకున్నారు. పట్టణంలోని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మొదటి లడ్డూను వ్యాపారి మోహన్ రూ.2.05 లక్షలకు, రెండవ లడ్డూను అశోక్ యాదవ్ 1.16లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే హిందువాహిని మొదటి లడ్డూను సారంగ్ వినయ్ రూ.1.62 లక్షలకు దక్కించుకున్నారు. ఇక నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో శివాజీదల్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూను వ్యాపారి బీఎస్ వీరశెట్టి రూ.1.55 లక్షలకు దక్కించుకున్నారు.

చిన్నగొట్టిముక్ల గ్రామంలో.. రూ.3.50లక్షలు..

శివ్వంపేట, సెప్టెంబరు 17: మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో గ్రామంలోని గణనాథుడి లడ్డూను బీఆర్ఎస్ సీనియర్ నేత సింగయ్యపల్లి గోపి రూ.3.50 లలకు దక్కించుకున్నాడు.

బాలికపై అత్యాచారం

● నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

రామచంద్రాపురం, సెప్టెంబరు 17: బాలిక(7)పై బాలుడు(17) అత్యాచారానికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలో నివాసముంటున్న బాలుడు(17) చదువు మానేసి జులాయిగా తిరుగుతున్నాడు. సదరు బాలుడి ఇంటి పక్కనే ఉంటున్న బాలిక(7)పై సోమవారం అత్యాచారానికి తెగబడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో గాయాలపాలైన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు మంగళవారం రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకుని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఆరోగ్య శ్రీ సేవలు బంద్ !

● నేటి నుంచి ఉద్యోగుల నిరవధిక సమ్మె

సంగారెడ్డి అర్బన్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17 : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత నెల 20 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజాప్రతినిధులుకు వినతిపత్రాలు సమర్పించినా, సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెకు నిర్ణయించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిరవధిక సమ్మెలోకి వెళ్తే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. నిరవధిక సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ కోరారు.

ఆస్తి కోసం తండ్రి హత్య



మారుతి(ఫైల్)

ఝరాసంగం, సెప్టెంబరు 17: ఆస్తి కోసం కన్న తండ్రిని తనయుడు దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. స్థానిక ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారుతి(75)కి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నది. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అయితే మారుతికి కుప్పానగర్ గ్రామ శివారులోని 137 సర్వే నంబరులో 35 గుంటల భూమి ఉన్నది. ఈ భూమిని తన పేరున చేయాలని రెండో కుమారుడు శ్రీనివాస్ మూడునెలలుగా తండ్రిని వేధిస్తున్నాడు. కాగా రోజు మాదిరిగానే మారుతి వ్యవసాయ పొలం వద్ద కాపలా ఉండి గట్టుపై నిద్రిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ తాగిన మైకంలో అక్కడికి వెళ్లి బండరాయితో మారుతిని బలంగా మోది హత్య చేశాడు. పెద్ద కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మృతదేహానికి జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పులు తీర్చే మార్గం లేక వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులు మృతదేహం

మద్దూరు, సెప్టెంబరు 17 : అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం ప్రకారం మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు(50) కూలీకి వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిన్న కూతురు వివాహానికి ఇంటిపై రూ.3.50లక్షల ఫైనాన్స్ తీసుకున్నాడు. రోజూ కూలీతో వచ్చే డబ్బులతో అప్పు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట ఉన్న సజ్జ కొండికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కర్రె కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అలిగి పుట్టింటికి పోయిందని భర్త..

తూప్రాన్, సెప్టెంబరు 17: గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ పట్టణంలో నివాసముండే కడమంచి గణేష్ (26) ఈ నెల 9న భార్యతో సంసారం విషయంలో గొడవపడ్డాడు. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోగా.. మనస్తాపానికి గురైన గణేష్ అదే రోజు రాత్రి టాయిలెట్లు శుభ్రం చేసే కెమికల్‌ను తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడిని కుటుంబీకులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులకు కోసం వెళ్లిన వ్యక్తి శవమై..

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



నర్సింహులు(ఫైల్)

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండలం కొంటూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం మెదక్ మండలం మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు(40) సోమవారం సాయంత్రం చిన్నశంకరంపేట వెంకటాయపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దగ్గరకు డబ్బుల కోసం వెళ్లాడు. దీంతో ఆ వ్యక్తి రూ.40 వేలు ఇచ్చి కొంటూర్ వద్ద దింపి వెళ్లగా.. అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని బైకుపై తీసుకెళ్లినట్లు సదరు వ్యక్తి తెలిపాడు. కాగా, మంగళవారం ఉదయం కొంటూర్ చెరువు ఆవరణ ముళ్ల పొదల పక్కన నర్సింహులు మృతదేహం లభ్యమైంది. అక్కడికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై మురళి తెలిపారు.

అనుమానాస్పద స్థితి మృతిపై కేసు..



బాల్‌రాజ్(ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 17: మండల పరిధిలోని బీబీపేట్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంగళి బాల్‌రాజ్(38) సోమవారం రాత్రి బైకుపై నుంచి పడి మరణించగా స్థానికులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహాన్ని పరిశీలించిన కల్హేర్ పోలీసులు రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు లేదని అనుమానించారు. భార్య మంగళి శివలీల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మృతుడు బాల్‌రాజ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జర్నలిస్టు సూర్యప్రకాశ్‌కు అండగా మంత్రి దామోదర రాజనర్సింహ

● వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష సాయం

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు కేవీఎస్ఎస్ ప్రకాశ్‌కు తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అండగా నిలిచారు. ప్రకాశ్ చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మంత్రి సూచన మేరకు ఈ మొత్తాన్ని ప్రకాశ్ బ్యాంక్ అకౌంట్‌కు పంపిస్తున్నామని ఆయన కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఢిల్లీలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రకాశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో 4 రోజుల క్రితం అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు మంత్రి దామోదర దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఢిల్లీలో పనిచేస్తున్న పలువురు రిపోర్టర్లతో మంగళవారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ప్రసాద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఆయన చికిత్స కోసం తాను వ్యక్తిగతంగా రూ.లక్ష సాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సర్కార్ అండగా ఉంటుందని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలను సమస్యను కూడా ఇటీవలే పరిష్కరించామని మంత్రి గుర్తు చేశారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ కింద జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోజుకో అవతారంతో కొట్టేస్తున్నారు..

పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు..

మల్యాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గతంలో తీసుకున్న రుణం తీరిపోవడంతో కొత్త రుణం కోసం అన్‌లైన్‌లో వచ్చిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో అడిగినట్లుగా మార్జిన్ డబ్బులు రూ.3లక్షలు చెల్లించారు. ఇంకా కొంత చెల్లిస్తేనే రుణం అందుతుందని మళ్లీ మళ్లీ పోన్ కాల్స్ చేస్తుండడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మనిదేవునిపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ట్రాక్టర్ ఫైనాన్స్ ఈఎంఐ చెల్లించేందుకు తన బ్యాంకు ఖాతాలో రూ.70వేలు జమ చేశాడు. తన వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఎస్‌బీఐ రివార్డ్స్ మెసేజ్‌ను క్లిక్ చేయడంతో తన ఖాతా ఖాళీ అయినట్లు మెసేజ్ వచ్చింది.

మారేపల్లి చెందిన వ్యక్తి కుడా ఇలానే చేసి రూ.32వేలు పోగట్టుకున్నాడు. ప్రైవేటు ఉపాధ్యాయుడు అన్‌లైన్‌లో వచ్చిన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీ లింక్‌తో రూ.24 వేలు చెల్లించి మోసపోయాడు.

● స్మార్ట్ ఫోన్లతో సామాన్యుల చిట్టా సైబర్ నేరగాళ్ల చెంతకు..
● మోసపోయినా అవమానంగా భావించి బయటకు రాని బాధితులు

కొండాపూర్, సెప్టెంబరు 17 : రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతుండడం సామాన్య ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది. స్మార్ట్‌ఫోన్ల వినియోగం సామాన్యులకు ఎక్కువగా అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లకు ఏమాత్రం అవకాశం దొరికినా వీరి ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. రుణాలు ఇస్తామని అశచూపి మార్జిన్ మనీ పే చేయాలంటూ ట్రాప్ చేస్తున్నారు. ఎక్కువగా ఉన్నత చదువులు చదివిన వ్యక్తులే మోసాలకు గురవుతుండడం గమనార్హం.



అకౌంట్లు హ్యాక్ చేసి..

సోషల్ మీడియాలో వచ్చే మేసేజ్ లింక్స్ షేర్స్, ఐఏఎస్, ఐపీఎస్, స్నేహితుల ట్రూకాలర్ ప్రొఫైల్ ఫొటో, పేర్లు, రిక్వెస్ట్‌లు ఇలా పలు అంశాలకు సంబంధించి కాల్స్ చేస్తూ స్పదించిన వారి నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారు. ఒక్క క్లిక్‌తో ఫోన్ హ్యాక్ అయ్యి సైబర్ నేరగాళ్ల చేతిల్లోని ఫోన్‌కు వ్యక్తుల డాటా మొత్తం పోతున్నది. దీంతో సులువుగా బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బును దోచేస్తున్నారు. అంతేకాకుండా వాట్సాప్, ఫేస్‌బుక్ హ్యాక్ చేస్తూ ఫోన్ నంబరు ద్వారా సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేస్తూ తాను ఆస్పత్రుల్లో ఉన్నాని, డబ్బులు అత్యవసరమని చెబుతున్నారు. ఇది నిజమేనని నమ్మి అవతలి వ్యక్తులు డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ క్రమంలో నా ఫోన్ హ్యాక్ అయ్యిందని, నా పేరిట ఎవరూ నగదు అడిగినా ఎంపవద్దని వాట్సాప్ గ్రూపల్లో సందేశాలు పంపడంతో నిజం తెలిగానే మోసాపోయామని గుర్తించి నిస్సహాయంగా ఉండిపోతున్నారు.



వీటి జోలికి పోవద్దు : కొండాపూర్ సీఐ చంద్రయ్య



కేవైసీ అప్‌డేట్.. ఫలానా యాప్ డౌన్‌లోడ్ అంటూ వచ్చి లింక్‌ల జోలికి వెళ్లకూడదు. ఆన్‌లైన్ రుణాలు, లక్షల్లో లాటరీల కోసం నగదు చెల్లించాలంటే నమ్మొద్దు.మైక్రో ఫైనాన్స్, రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఆన్‌లైన్ వస్తువల కొనుగోలులో నమ్మకమైన యాప్‌లను ఆశ్రయించాలి. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రతి మెసేజ్‌ను క్షుణంగా చదివి అవతలి వ్యక్తి సమాచారాన్ని పూర్తిగా తెలుసుకొని స్పందించాలి.సైబర్ నేరాలు నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.


హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఆర్డీవో రామ్మూర్తి


కోహెడ: జూనియర్ కళాశాలలో జెండాను ఎగురవేస్తున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాట యోధులను స్మరించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట టౌన్: మున్సిపల్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు


జగదేవ్‌పూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్

విముక్తి కల్పించిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదే

● సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 17: నాటి దొరలు, దేశ్‌ముఖ్, రాజాకారుల మూకలను తరిమి కొట్టి తెలంగాణకు విముక్తి కల్పించిన ఘనత కమ్యూనిస్టు పార్టీలకే దక్కుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో పార్టీ కార్యాలయం ఎదుట తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉందని, అణగారిన వర్గాల కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, బస్సీలాల్ ,మల్లేశం, చంద్రం, సుధాకర్, ప్రసన్నకుమార్, బిక్షపతి, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమర వీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం సూచించారు. తెలంగాణా సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మండలంలోని పోతారం(ఎస్)లో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు వంగపల్లి సోమరాజం స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, జంగ విజయ, మల్లారెడ్డి రమణారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్: జెండాను ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శి మంద పవన్

తెలంగాణకు విమోచనం లభించిన రోజు సెప్టెంబరు 17

● బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17 నియంతృత్వ నిజాం నుంచి తెలంగాణకు విమోచనం లభించిన రోజని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విమోచన దినం సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటం చేశారని, అనేక బలిదానాలు, త్యాగాల అనంతరం తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్, పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు, శివకుమార్, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, రాహుల్, సునీల్, దేవేందర్, మోతుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కుకునూరుపల్లి: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురువారెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● దుబ్బాక: స్థానిక ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు అంబటి బాలేష్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, యాదవ రెడ్డి, గవ్వల రమేష్ తదితరులున్నారు

● మిరుదొడ్డి: మండలంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.


సిద్దిపేట క్రైం: జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం


సిద్దిపేట రూరల్: జక్కాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 17: సచివాలయం ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం తగదని పేర్కొంటూ మంగళవారం చేర్యాల, కొమురవెల్లి మండలకేంద్రాలలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నిరసన తెలిపారు.

● బెజ్జంకి: మండలంలోని గుండారం గ్రామంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

● సిద్దిపేట రూరల్: మండలంలోని జక్కాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుర్గం పరుశురాములు, మాజీ ఎంపీటీసీ భాను చందర్, మాజీ ఉపసర్పంచ్ ఏకాంబరం, జిల్లా మహిళ నాయకులు కోంపెల్లి పద్మ, నాయకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట టౌన్: పట్టణంలోని కోటిలింగేశ్వాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు ఆధ్వర్యంలో క్షీరాబిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాపెల్లి విఠోభ, దాసరి శ్రీనివాస్‌యాదవ్, వరాల సురేష్, తెల్జీరు శ్రీనివాస్‌యాదవ్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగిటి నర్సింహులు, అనితరెడ్డి, అర్చనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో నాడు గాంధీలు.. నేడు గాడ్సేలు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 17: కాంగ్రెస్‌లో నాడు గాంధీలు ఉంటే.. నేడు గాడ్సేలు ఉన్నారని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పోరాటం చేసి, ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తరలిస్తామని, అమరుల దీపం, సెక్రటేరియట్ మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని కేసీఆర్ భావించారన్నారు. ఆయనవెంట మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులున్నారు.

● రాయపోల్: ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని విస్మరించి సెక్రటేరియట్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తారా అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని ఎల్కల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సెక్రటేరియట్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టి తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గంలో రోడ్లు సరిగ్గా లేవని, తాము ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆయనవెంట మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, మాజీ జడ్పీటీసీ యాదగిరి, నాయకులు శ్రీనివాస్, ఫర్వేజ్ ఉన్నారు.


గజ్వేల్: విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పెరియార్ రామస్వామి జయంతి

కుకునూరుపల్లి, సెప్టెంబరు 17: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పెరియార్ రామస్వామి 145వ జయంతిని బీఎస్పీ నాయకులు నిర్వహించారు. రామస్వామి చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం కోశాధికారి కనకప్రసాద్, స్వామి, కరుణాకర్, హరికృష్ణ, స్వామి తదితరులున్నారు.

గ్రామ పంచాయితీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటరు జాబితా ప్రదర్శన

● ఎంపీడీవో విజయలక్ష్మి

వర్గల్, సెప్టెంబరు 17: రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం రెండో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా ముసాయిదాను వార్డుల వారీగా అన్ని గ్రామపంచాయతీలు, మండల కార్యాలయం, ముఖ్య ప్రదేశాల్లో ప్రదర్శిస్తామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

రైతులకు పారదర్శక సేవలందించాలి

● డీసీవో నాగేశ్వర్‌రావు

ములుగు, సెప్టెంబరు 17: సహకార సంఘాల్లో రైతులకు పారదర్శకంగా సేవలందించాలని జిల్లా సహకారాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రం ములుగులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కేంద్రాన్ని మంగళవారం సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వాహనాధికారి రమేష్ బాబు, పీఏసీఎస్ సిబ్బంది స్వరూప, అశోక్ ఉన్నారు.

19న టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం

● మండల ప్రధాన కార్యదర్శి వెంకట్

మర్కుక్, సెప్టెంబరు 17: ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు గజ్వేల్ కేంద్రంలో ఉన్న ఓ గార్డెన్‌లో టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు మర్కుక్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు. మర్కుక్ మండల జడ్పీహెచ్ఎస్ఎస్ ఉన్నత పాఠశాల చేబర్తిలో మంగళవారం టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసింహరావు, రవీందర్‌రావు, రమాకాంతరావు, విశ్వేశ్వర్, రాజయ్య, గౌతమి పాల్గొన్నారు.


మర్కుక్: కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి

● గజ్వేల్ రూరల్: టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ కోరారు. గజ్వేల్ పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రో. కోదండరాం హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంచంద్రం, గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, మర్కుక్, ములుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'ఆకుకూరలతో సంపూర్ణ పోషకాహారం

● ఐసీడీఎస్ ఎసీడీపీవో ఛాయాదేవి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 17: చిరుధాన్యాలు సహజ సిద్ధంగా లభించే ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన సంపూర్ణ పోషకాహారాలు అందుతాయని ఐసీడీఎస్ ఎసీడీపీవో ఛాయాదేవి పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలో సెక్టార్ లెవల్ పోషణ మాస ఉత్సవ కార్యక్రమంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ టీచర్స్ బాలింతలు, గర్భవతులకు పోషణ ఆహారంపై, తీసుకోవలసిన జాగ్రత్తలపై, చిరుధాన్యాలు తీసుకుంటే కలిగే లాభాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉండే పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్స్ కృష్ణవేణి, నిర్మల పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవం

రాయపోల్, సెప్టెంబరు 17: మండలంలోని ఎల్కల్‌లో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో మంగళవారం అనంత చతుర్దశి మహోత్సవాన్ని పురస్కరించుకుని సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవంలో మాజీ సర్పంచ్ పిట్ల చిన్నవెంకటయ్య, నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, తాజా మాజీ జడ్పీటీసీ యాదగిరి తదితరులున్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

● విశ్వకర్మ జయంతి సందర్భంగా నిర్వహణ

కోహెడ, సెప్టెంబరు 17: మండలంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ వీధి నుంచి విశ్వకర్మ ఆలయ ప్రాంగణం వరకు విశ్వకర్మ భగవాన్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు రేవోజు సదానందం, మండల అధ్యక్షుడు గూడూరి రవీందర్‌చారి, ప్రధాన కార్యదర్శి రేవోజు శంకర్, ఉపాధ్యక్షులు పుల్లూరి నవీన్ కుమార్, మిట్టపల్లి జనార్దన్‌చారి, కోశాధికారి నాగరాజు, సహాయక కార్యదర్శి విష్ణుచారి, ప్రభాకరచారి, ముఖ్య సలహాదారుడు విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

● హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎగ్గోజు శ్రీనివాసచారి, ఉప్పుల శ్రీనివాస్, పోలోజు సదానందచారి, కందారపు రాజమౌళి, నర్సింహచారి, విష్ణుమూర్తి, చంద్రమౌళి, కందుకూరి సదానందం, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

● కుకునూరుపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు సుదర్శన్‌చారి ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేరెళ్ల నరసింహచారి, లక్ష్మణ్, నరసింహచారి, వెంకటేశం, ఆంజనేయులు, శ్రీశైలం, శ్రీనివాస్, రామదాసు, రమేష్, కొండయ్య, శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

● చేర్యాల: కొమురవెల్లి మండలకేంద్రంతో పాటు కిష్టంపేటలో విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


కోహెడలో శోభాయాత్ర నిర్వహిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

నాలుగో సారి లంబోదరుడి లడ్డూ దక్కించుకున్న ముస్లిం నాయకుడు


వార్డు మహిళలకు లడ్డూను అందజేస్తున్న ఇమామ్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు17: గణపతి నవరాత్రుల్లో భాగంగా సిద్దిపేట పట్టణంలోని తొమ్మిదో వార్డులో పోటాపోటీగా సాగిన వినాయకుడి లడ్డూను వేలం పాటలో కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ నాల్గోసారి దక్కించుకున్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని తొమ్మిదో వార్డులో బాల గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి మడపం వద్ద నిర్వాహకులు లడ్డు వేలం పాటను నిర్వహించారు. ఈ ఏడాదితో వరుసగా నాల్గోసారి రూ. 10,500 లకు స్వామి వారి లడ్డు దక్కించుకున్నట్లు, లడ్డు ప్రసాదాన్ని వార్డు ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి'

చేర్యాల, సెప్టెంబరు 17: కొమురవెల్లి మండలం ఐనాపూర్-రాంసాగర్ దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డితో పాటు స్థానిక రైతులు గ్రామశివారులో వరదనీటి ప్రవాహ కాలువను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐనాపూర్ నుంచి రాంసాగర్, పెద్దరాజుపేటకు వెళ్లే మార్గంలో వాగు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై వాగునీటి ప్రవాహం నుంచి రక్షించేందుకు వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నర్సింహులు, కనకయ్య, రాములు, గోపాల్, రవి, స్వామి, కనకయ్య, రాందాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి

తొగుట, సెప్టెంబరు 17: రైతన్నలు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి పేర్కొన్నారు. మండలంలోని కాన్గల్‌లో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దొమ్మాట స్వామి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు 10వేల ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ సత్తయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శ్రీనాకర్‌రెడ్డి, మండల నాయకులు కొంగరి నర్సింహులు, తదితరులున్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 17: అకాల వర్షాలతో నష్టపోయిన ఖమ్మం వరద బాధితులకు రూ. 2 లక్షల విలువైన నిత్యావసర సరుకులతో వెళ్తున్న వాహనాన్ని సెయింట్‌మెరీస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి ప్రారంభించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్‌మెరీస్ విద్యానికేతన్ హైస్కూల్ ఎస్ఎస్‌సీ, సీబీఎస్ తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం తమ వంతు సహాయంగా 46 క్వింటాల్ బియ్యం, 102 బ్యాగుల దుస్తులు, సబ్బులు, పప్పులు, తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులందరికీ 26 వేల కనీస వేతనం నిర్ణయించాలి: సీఐటీయూ

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 17: జిల్లాలోని కార్మికులందరికీ 26వేల కనీస వేతనంగా నిర్ణయించి, నాన్ పర్మినెంట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం 26వేల రూపాయలు నిర్ణయించాలని, కార్మికులందరికీ ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహులు, యాదగిరి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్‌ఫిల్టర్ ఏర్పాటు


వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 17: గజ్వేల్ మండలంలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో వాటర్‌ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మంగళవారం వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ అబ్దుల్, నాయకులు కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 17: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో పట్టణంలో నిర్వహించిన వాహన తనిఖీలో 14 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 14 మందికి రూ.21,000 జరిమానా విధించారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్ పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రాయపోల్/సిద్దిపేట రూరల్/కోహెడ, సెప్టెంబరు 17: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయం వద్ద తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల బాబు, జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, స్వామి, సుధాకర్, రాము లక్ష్మణ్, భిక్షపతి, మహేష్, రంజిత్, రాజనర్సు పాల్గొన్నారు. అలాగే కోహెడ మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, బండ జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'స్వచ్ఛత హీ సేవ'


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవో సోమిరెడి

చిన్నకోడూరు/మద్దూరు/సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 17: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ప్రజలతో కలిసి మానవహారం, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవో సోమిరెడ్డి, ఏపీవో స్రవంతి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదిరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తిలో మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వీరరాజ్, సెక్రటరీ మాదవ్‌జాదవ్, వైద్యాధికారి సువర్ణ సన్, మహిళా సంఘాల సభ్యులు జయమ్మ, సబిత, గ్రామస్థులు పాల్గొన్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ అశ్రిత్‌కుమార్ చెత్తాచెదారం ఏరివేశారు. కళాశాల అవరణలో మొక్కను నాటారు. అంతకుముందు విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. చెత్తను బయట వేయకూడదనే సందేశాన్నిస్తూ మానవహారం చేపట్టారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రతీఒక్కరి బాధ్యత అని కమిషనర్ అశ్రిత్ కుమార్ విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలలోని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ సందర్శించి ఫిష్ హచేరీ యూనిట్, సిర్పులినా కల్చర్, ఆక్వాహబ్, ఎర్త్ సెంటర్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డీఈ ప్రేరణ, ప్రిన్సిపల్ సునిత, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఐటీసీ బాసిల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లిని పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం


మాట్లాడుతున్న నాగపురి రాజలింగం

మద్దూరు, సెప్టెంబరు 17: బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి ఈ ప్రాంత పోరాట చరిత్రను ముందుతరాలకు అందించాలని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవంలో సర్దార్ సర్వాయి పాపన్న సినీహీరో జైహింద్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిజాం రజాకార్ల దాష్టీకానికి ఒకేరోజు బైరాన్‌పల్లిలో 116 మంది, కూటిగల్‌లో 30 మంది బలయ్యారన్నారు. మహిళలను వివస్త్రలను చేసి మృతదేహాల చుట్టూ బతుకమ్మ ఆడించి రాక్షసానందం పొందారన్నారు. సమాచార వ్యవస్థ లేనందున బీబీసీలో ప్రసారమైన బైరాన్‌పల్లి భయానక పరిస్థితులకు చలించిన అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యకు పూనుకోవడంతో ఎట్టకేలకు నిజాం లొంగిపోవడంతో విముక్తి లభించిందన్నారు. 13 నెలల 2 రోజులు తెలంగాణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. శాలిగౌరారంలోని వల్లాల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి తాము వెళ్తున్నట్లు సర్దార్ సర్వాయి పాపన్న సినీహీరో హింద్‌గౌడ్ తెలిపారు. బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి యాదగిరిగుట్ట, ఉప్పల్ ప్రాంతాల నుంచి నేరుగా బస్సు సౌకర్యాన్ని ఏర్పాటుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి పాటు కృషిచేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఆనాటి పోరాటంలో అసువులు బాసిన కుటుంబాలకు ఆదుకునేందుకు విజ్ఞాపన చేయనున్నట్లు తెలిపారు. వీరి వెంట పార్టీ మండలాధ్యక్షుడు మేక మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు షౌకత్ అలీతో ఉన్నారు.

క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా చింతమడక

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17: ఈనెల 12,13 తేదీల్లో జడ్పీహెచ్ రాఘవాపూర్‌లో జరిగిన సిద్దిపేట రూరల్ మండలం స్థాయి పాఠశాలల ఆటల పోటీల్లో అత్యధిక బహుమతులు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని చింతమడక విద్యార్థులు కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్త రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ బాలురు కబడ్డీలో ప్రథమ, సీనియర్ బాలికల కబడ్డీ ద్వితీయ, సీనియర్ బాలికల ఖోఖోలో ద్వితీయ, జూనియర్ బాలికల వాలీబాల్‌లో ప్రథమ, జూనియర్ బాలికల ఖోఖోలో ద్వితీయ, జూనియర్ బాలుర ఖోఖోలో ద్వితీయస్థానం సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ వెంకటస్వామిని ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజ్, అజీజ్, సత్తయ్య, రాందాస్, ఈ.రాజు, రామ్ రెడ్డి, శ్రీహరి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, కృష్ణమని అభినందించారు.

ఎస్జీఎఫ్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక: ఎంఈవో

వర్గల్, సెప్టెంబరు 17: వర్గల్ మండలంలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి సునీత తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో అండర్-14, 17 విభాగాలకు సంబంధించి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న బాలికలకు, 21న బాలురకు ఎంపికలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీ, పీఈటీలు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. కబడ్డీలో అండర్-14 బాలుర విభాగంలో 51 కేజీ, బాలికల విభాగంలో 48 కేజీ, అండర్-17 బాలుర, బాలికల విభాగంలో 55 కేజీ ఉండాలన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు పుట్టినతేదీ సర్టిఫికెట్ తీసుకురావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీ.లక్ష్మీనారాయణ, పీడీ 9963732410 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చేర్యాల, సెప్టెంబరు 17: చేర్యాల మండలం షబాషీగూడెంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు రెండు నెలలక్రితం వాటర్ ప్లాంటు పాడైపోయినా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు వీధులగుండా రోడ్డు పై ప్రవహిస్తుందని, పారిశుధ్య పనులను చేయాలని కోరారు.